క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మునగపాక: మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. మునగపాక, నాగులాపల్లి, ఉమ్మలాడ, ఒంపోలు, నాగవరం, వాడ్రాపల్లి, గంగాదేవిపేట గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

కోటవురట్ల: కైలాసపట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. దీని పరిధిలో 33/11 కె.వి లైన్ నిర్వహణలో భాగంగా చెట్టు కొమ్మల నరికివేత చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కోటవురట్ల, చినలింగాపురం, గవరపేట, జానకిరాంపురం గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

లబ్ధిదారులకు మెరుగైన సేవలందించాలి



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మండల రేషన్ డిపో డీలర్లు

మునగపాక: రేషన్ సరకులను ప్రతి నెలా సకాలంలో లబ్ధిదారులకు అందించాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ సూచించారు. మునగపాక తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను బుధవారం మండలంలోని రేషన్ డిపో డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రేషన్ డిపోలను ప్రతి నెల 1 నుంచి 15 వరకు తెరిచి ఉంచాలన్నారు. లబ్ధిదారులకు మెరుగైన సేవలందించడంతో పాటు సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ మండల అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పల్లపు ఆనందపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు

మునగపాక: ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ రీసోర్స్ పర్సన్ అప్పారావు కోరారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. వలస కూలీలను నివారించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి పెదబ్బాయి, అల్లవరపు రమణబాబు, పథకం కార్మికులు పాల్గొన్నారు.

మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక మళ్లీ వాయిదా



ఉప సర్పంచ్ ఎన్నికపై మాట్లాడుతున్న ఎన్నికల అధికారి దీపిక

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్ ఎన్నిక బుధవారం వాయిదా పడినట్లు ఎన్నికల అధికారి దీపిక తెలిపారు. ఉప సర్పంచ్ పదవికి గత కొంత కాలంగా ఎన్నిక నిర్వహిస్తున్నా వార్డు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో తరచూ వాయిదా పడుతూ వస్తుంది. దీనిలో భాగంగా బుధవారం మరోసారి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారి దీపిక ఏర్పాట్లు చేశారు. ఈ సారి కూడా వార్డు సభ్యులెవరూ రాకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

వైద్య శిబిరానికి స్పందన

ఎస్.రాయవరం: గోకులపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక యువకుడు లింగంపల్లి జ్యోతికుమార్ జన్మదినం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 310 మందికి సుర్జా హాస్పటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ శిబిరంలో స్థానిక యువకులు సమ్మెంగి రాజుబాబు, రాంబాబు, గణేష్, దమ్ము రాజు బుజ్జి, ధన పాల్గొన్నారు.

అన్నదాతకు ఆదిలోనే అష్టకష్టాలు..!

- ముఖం చాటేసిన వరుణుడు
- ఎండిపోతున్న నారుమడులు
- కాపాడుకునే పనిలో రైతుల నిమగ్నం



తిమ్మాపురంలో బీటలు వారిన నారుమడులు



ఎస్.రాయవరంలో నారుమడిని కాపాడుకునేందుకు రైతు అవస్థలు

ఎస్.రాయవరం: ఆదిలోనే హంస పాదు అన్న చందంగా తయారైంది ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతుల పరిస్థితి. వరుణుడు ముఖం చాటేయడంతో ఎంతో ఆశతో సిద్ధం చేసిన నారుమడులు ప్రస్తుతం ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఎస్.రాయవరం మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 7 వేల ఎకరాలు. వర్షాలు అనుకూలిస్తే 10 వేల ఎకరాల వరకు వరినాట్లు వేసే అవకాశం ఉంది. అయితే ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం జూన్ నెలలో అడపాదడపా వర్షాలు ఆగకుండా కురవడంతో అన్నదాతలు నారుమడులు సిద్ధం చేసుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై అందుకున్న విత్తనాలను నారుమడుల్లో చల్లారు. అవి మొలక దశకి వచ్చే సరికి వర్షాలు లేక నారు పూర్తిగా ఎండిపోయింది. కొన్ని ఆకుమడులు బీటలు వారి కనిపిస్తున్నాయి. కనీసం నీటి తడి పెడదామన్నా సమీపంలో నీరు అందుబాటులో లేకపోవడంతో ఎండిన ఆకుమడి వైపు చూసుకుంటూ రైతులు కన్నీరు పెడుతున్నారు. గోకుపాడు, గెడ్డపాలెం, వమ్మవరం, దార్లపూడి గ్రామాల్లో బోర్లు ఉన్న రైతుల సహాయంతో మిగతా రైతులు తమ నారుమడులను బతికించుకుంటున్నారు. నీరు అందుబాటులో లేని తిమ్మాపురం, కొరుప్రోలు, పెదఉప్పలం, పెదగుమ్ములూరు, ఉప్పరాపల్లి, సర్వసిద్ధి, వాకపాడు గ్రామాల్లో వరి నారుమడుల పూర్తిగా ఎండిపోయాయి. మండలంలో 90 శాతం పంటల సాగు పూర్తిగా వర్షాధారం. అలాంటిది ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలిందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాలు కురవకపోతే మొలకెత్తిన విత్తనాలు పూర్తిగా పాడవుతాయని వాపోతున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే విత్తనాల కోసం పరుగులు తీయాల్సిందేనని చెబుతున్నారు.

నారు ఎండిపోయేలా ఉంది..



గత నెలలో తరచూ వర్షాలు పడడంతో రైతు సేవా కేంద్రం నుంచి తీసుకువచ్చిన విత్తనాలు నారుమడుల్లో చల్లాను. అవి మొలకెత్తిన తరువాత వర్షం పడలేదు. నారు ఎండిపోయేలా ఉంది. నీరు తడి పెడదామంటే చెరువులో నీరు లేదు. ఖరీఫ్ ప్రారంభంలోనే ఇలా ఉంటే సాగు ఎలా చేపట్టగలం.

– బాదనపల్లి వీర్రాజు, కౌలు రైతు, తిమ్మాపురం

ఖరీఫ్ ప్రారంభంలోనే దెబ్బ



వరి నాట్లు వేసేందుకు నారుమడులు వేశాం. ఖరీఫ్ ప్రారంభంలోనే నారుమడులకు నీరు లేదు. నీరు అందిద్దామంటే అవకాశం లేదు. మరోవైపు వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. మొలిచిన ఆకుమడులు ఎండిపోతున్నాయి.

– నాగంబోయిన శ్రీనివాసరావు, రైతు, గోకులపాడు

మళ్లీ విత్తనాల సరఫరాకు నివేదిక



రైతులకు రాయితీపై విత్తనాలు పూర్తిగా సరఫరా చేశాం. గత నెలలో వర్షాలు పడడంతో అందరూ నాడుమడులు సిద్ధం చేసుకున్నారు. 10 రోజులుగా ఎండలు ఎక్కువగా కాయడంతో కొన్ని నారుమడులకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నారుమడులు పోయిన వారికి మళ్లీ విత్తనాలు సరఫరా చేసేలా నివేదిక సిద్ధం చేస్తాం.

– సౌజన్య, వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం మండలం

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

నక్కపల్లి: చినదొడ్డిగల్లు ఎంపీయూపీ స్కూల్–2 నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు పిన్నింటి సురేష్‌కుమార్‌ను ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక అందించి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ అలబోయిన గోవింద్, ఏపీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఫాల్గుణరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం.బాలాజీ, ఉపాధ్యాయులు కొండలరావు, అప్పారావు, రంగబాబు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె ఉపాధి హామీ పథకం రీసోర్స్‌పర్సన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. అవినీతికి అస్కారం లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పూర్వ వైభవానికి కృషి



అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



సమావేశంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులతో ధర్మశ్రీ

- నియోజకవర్గ సమన్వయకర్త ధర్మశ్రీ
- స్వగ్రామం మామిడివాడ కొత్తూరులో సమావేశం

అచ్యుతాపురం రూరల్ : యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొస్తానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కరణం ధర్మశ్రీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. రాంబిల్లి మండలంలోని స్వగ్రామమైన మామిడివాడ కొత్తూరులో బుధవారం నాలుగు మండలాల ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అంతకు ముందు ఇంటి ఇలవేల్పు పైడితల్లమ్మ అమ్మవారిని, గ్రామ దేవత కొత్తమ్మతల్లిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, యలమంచిలి మాజీ శాసనసభ్యుడు కన్నబాబు రాజు సహాయ సహకారాలతో యలమంచిలి నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేయడానికి కృషి చేస్తానన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాయకులందర్నీ ఒక తాటిపైకి తీసుకువచ్చి తనకిచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చుతానన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్‌ను కలుపుకొని పార్టీని బలోపేతం చేస్తానన్నారు. ఆదివారం అచ్యుతాపురం మండలం కొండకర్లలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి, ఆ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త కన్నబాబురాజు నుంచి బాధ్యతలు చేపడతానని ధర్మశ్రీ తెలిపారు. తదుపరి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రోజుకో మండలం చొప్పున గ్రామాల్లో పర్యటించి వారి సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తానన్నారు. పార్టీ శ్రేణుల సహకారంతో రాజన్న రాజ్యం తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషిస్తానన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యలమంచిలి మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు గొర్లి వెంకట్, మూర్తి, రాంబిల్లి మండల పరిషత్ అధ్యక్షుడు గొట్టుముక్కల శిరీషా శ్రీనుబాబు, జెడ్పీటీసీ దూళి నాగరాజు, పార్టీ అధ్యక్షుడు కిషోర్ రాజు, పార్టీ మండల సీనియర్ నాయకులు నెట్టెం సత్యనారాయణ, గోకివాడ సర్పంచ్ సూర్యనారాయణ, మామిడివాడ గ్రామ అధ్యక్షుడు రాఘవేంద్ర, అచ్యుతాపురం మండల పరిషత్ అధ్యక్షుడు కోన సంధ్యబుజ్జి, పార్టీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు, మునగపాక జెడ్పీటీసీ పెంటకోట సోముసత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు ఆడారి ఆచ్చిన్నాయుడు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సియ్యాద్రి బుజ్జి, నాలుగు మండలాల యూత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి పర్యటన

తుమ్మపాల: జిల్లాలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ గురువారం పర్యటించనున్నట్లు డీఆర్వో వై.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై జిల్లాలో షెడ్యూల్డ్ కులాల జనాభా, స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధి, నివాస ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలపై తీసుకుంటున్న చర్యలు వంటి అనేక అంశాలపై చర్చించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ద్రావణాల తయారీపై శిక్షణ



కోడిగుడ్లు, నిమ్మ రసంతో ద్రావణం తయారీపై శిక్షణ ఇస్తున్న కేంద్రం నిర్వాహకులు

కోటవురట్ల: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరు వద్ద ఉన్న మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో బుధవారం ద్రావణాల తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా 400 కోడి గుడ్లు, 200 నిమ్మ కాయల రసంతో ద్రావణాన్ని కేంద్రం నిర్వాహకురాలు కూండ్రపు అరుణ తయారు చేసి చూపారు. ఇది పంటల ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి డి.రమణ, వీవోఏ జి.లక్ష్మి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టు రూ.4 లక్షలకు విక్రయం

- రిలే నిరాహార దీక్ష చేపట్టిన అభ్యర్థి సునీత
- తిమ్మరాజుపేటలో ఎమ్మెల్యే సోదరుడి నిర్వాకం



రిలే నిరాహార దీక్ష చేస్తున్న మంత్రి సునీతకు మద్దతు తెలిపిన ఎస్సీ సంఘాల నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తన దక్కలేదంటూ మండలంలో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన మంత్రి సునీత బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ పోస్టును రూ.4లక్షలకు అమ్ముకున్నారంటూ స్థానిక ఎమ్మెల్యే, అధికారులపై ఆమె ఆరోపణ చేశారు. తనకు న్యాయం చేయాలంటూ బుధవారం గ్రామంలో ఆమె ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ అంగన్‌వాడీ హెల్పర్ మృతి చెందడంతో ఖాళీ అయిన పోస్టుకు మూడు నెలల క్రితం నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఆ పోస్టుకు గ్రామంలో తనతో పాటు మరో నలుగురు దరఖాస్తు చేయగా, తన కుటుంబ పరిస్థితిని సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కి వివరించగా తనకే ఆ పోస్టు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ పోస్టు కోసం ఎమ్మెల్యే సోదరుడు సుందరపు సతీష్‌కుమార్ రూ.4 లక్షలు లంచం తీసుకుని అదే గ్రామానికి చెందిన బీసీకి చెందిన యువతికి కట్టబెట్టారని సునీత ఆరోపించారు. ఈ విషయమై సునీత.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఐసీడీసీ పీడీకి ఫిర్యాదు అప్పగించారు. నేటివిటి, క్యాస్ట్ సర్టిఫికెట్లు లేకుండా పోస్టులో జాయిన్ అయినట్లు విచారణలో నిర్ధారణ చేశారని సునీత తెలిపారు.

సంఘటిత పోరాటంతోనే హక్కుల సాధన

రోలుగుంట : సీఐటీయూ అధ్వర్యంలో పలు శాఖల్లో పని చేస్తున్న ఆశాలు, ఐకేపీ, మధ్యాహ్న భోజనం, ముఠా కార్మికులు, పంచాయతీ, శానిటేషన్ కార్మికులు తమ సమస్యలపై మండలకేంద్రం రోలుగుంటలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు చిరంజీవి, అరెగెల్ల రాజు మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, పని గంటలు కుదించి, ఉద్యోగ భద్రత కల్పించి లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటితంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అనంతరం ఆయా సంఘాలకు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా ఇంద్ర, కార్యవర్గ సభ్యులుగా రాజబాబు, జ్యోతి, రాము, ఈశ్వర్రావు, కృష్ణ ఎన్నికయ్యారు.

పలు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు



జల్లూరులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్



రామన్నపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: 'ముట్టేస్తున్న సీజనల్ వ్యాధులు' శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పారిశుధ్యం మెరుగుకు ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం చర్యలు తీసుకోగా, వైద్యాధికారులు పలు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వ్యాధులపై ఆరా తీశారు. రాజుపేట శివారు రామన్నపాలెంలో వైద్యాధికారి బి.దేవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్తపూతలు సేకరించారు. గ్రామంలోని చేతిబోరుల నుంచి వాటర్ శ్యాంపిల్స్ సేకరించారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామంలో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. అవసరమైన వారి నుంచి రక్తపూతలు సేకరించామన్నారు. నీటి శ్యాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్షించనున్నట్టు తెలిపారు. డెంగ్యూ పేషెంట్ విశాఖలో డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని సర్పంచ్‌కు సూచించామన్నారు. కె.వెంకటాపురం పీహెచ్‌సీ పరిధి వైద్యాధికారి డాక్టరు ధనలక్ష్మి ఆధ్వర్యంలో రామచంద్రపాలెం శివారు సన్యాసిరాజుపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వ్యాధులపై ఆరా తీశారు. రక్తపూతలు, చేతిబోర్ల నుంచి శ్యాంపిల్స్ సేకరించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఆరుగురి నుంచి రక్తపూతలు సేకరించినట్టు తెలిపారు. యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టి, రక్షిత మంచినీటి పథకాలలో క్లోరినేషన్ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎస్ రమణమ్మ, ఏఎన్ఎం సాయివాణి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీను, వాసు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా



నాగులాపల్లిలో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ప్రభుత్వం భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణం చేపట్టారు. ఈ షాపుల ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుంది. ఈ షాపుల వెనక గ్రామానికి సంబంధించిన ప్రధాన డ్రైనేజీ ఉంది. గ్రామంలో మురుగునీరంతా ఈ కాలువ గుండా ప్రవహించి పక్కనే ఉన్న సాగునీటి కాలువలో కలుస్తుంది. ఈ కాలువ నిర్వహణ కోసం గత సర్పంచ్ యల్లపు భాస్కరరావు కొంత స్థలాన్ని విడిచిపెట్టారు. ఈ స్థలంపై గ్రామానికి చెందిన సతీష్ కన్నుపడింది. రాత్రికి రాత్రే పునాదులు లేచిపోయాయి. కాలువ నిర్వహణ కోసం గతంలో కొంత స్థలాన్ని వదిలేస్తే సంబంధిత స్థలంలో నిర్మాణాలు చేపట్టడం తగదంటూ భాస్కరరావు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి సంబంధించిన స్థలాన్ని కాపాడాల్సిన అధికారులు కూడా కనీసం పట్టించుకోలేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. పంచాయతీ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా



ఎంపీపీ ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి మనోరమ

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించాల్సిన ఎంపీపీ ఎన్నిక వాయిదా వేసినట్టు మండల ప్రత్యేకాధికారి మనోరమ తెలిపారు. ఎంపీపీ రాజీనామాతో ఎన్నిక అనివార్య కారణంగా ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఎన్నిక నిర్వహించాలన్నారు. అయితే ఇరు పార్టీల సభ్యుల్లో ఒక్కరు కూడా హాజరు కాకపోవడంతో ఎన్నిక గురువారానికి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ, పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సులువుగా కేసుల పరిష్కారం



పట్టణంలో మధ్యవర్తిత్వంపై ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జిలు, లాయర్లు

అనకాపల్లి టౌన్: మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులందరూ కేసులను సులువుగా పరిష్కరించుకోవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ అన్నారు. పట్టణంలోని హైకోర్టు ఆదేశాలు మేరకు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న తగాదాలకు కోర్టులకు రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి పి.నాగేశ్వరరావు, అడిషనల్ జడ్జి జి.రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హర శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

గాడి తప్పిన సచివాలయాలు

- సమయపాలన పాటించని ఉద్యోగులు
- కొరవడిన పర్యవేక్షణ



శారదనగర్‌లో తెరవని 17వ సచివాలయం

నర్సీపట్నం:నర్సీపట్నం మున్సిపాలిటీలో వార్డు సచివాలయాల్లో పాలన గాడి తప్పింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డు సచివాలయాలను అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలు అందించేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ పాలన పూర్తిగా గాడి తప్పింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో సచివాలయ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించటం లేదు. వివిధ పనులపై వచ్చిన ప్రజలు వెనుతిరుగుతున్నారు.వీఆర్వోలు పూర్తిగా సచివాలయాలకు రావటమే మానేసారు. తహసీల్దార్ కార్యాలయానికి పరిమితమై అక్కడ నుండే సేవలు అందిస్తున్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ శారదనగర్‌లో ఉన్న 17వ సచివాలయం సిబ్బంది బుధవారం సమయం 11 గంటలు కావస్తున్నా కార్యాలయం తెరవేదు. కనీసం సచివాలయం అని తెసేందుకు బోర్డు కూడా పెట్టలేదు. కులధ్రువీకరణ, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారు నిరాశతో వెనుతిరిగారు. ఈతరహాలోనే మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 17 సచివాలయాల్లో సిబ్బంది వ్యవహరిస్తున్నారు. కార్యాలయాల్లో ఎప్పుడో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. అసలు సమయపాలన పాటించనందున వివిధ పనులపై సచివాలయాలకు వచ్చిన వారు పదే పదే ప్రదక్షణలు చేస్తున్నారు. వార్డు వీఆర్వోలు అయితే అసలు సచివాలయాలను మరిచిపోయారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసుకుని వార్డులకు వెళ్లకుండానే పాలన సాగిస్తున్నారు. రెవెన్యూ పరమైన ఏపని అయిన సచివాలయంకు కాకుండా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సచివాలయాలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సురేంద్రను సంప్రదించగా సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com